క్లుప్తంగా

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

చింతకాని: గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారి డాక్టర్ ప్రమీల సూచించారు. మండలంలోని నాగులవంచ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వ్యాక్సినేషన్‌ను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. గర్భిణులు, పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, ఏఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు కవిత, ఉమారాణి, నాగేంద్ర, సరస్వతి, పాల్గొన్నారు.

న్యూలిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

వైరా: న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ సైన్స్ ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ మాథ్స్ ఒలంపియాడ్‌లో వైరా శాంతినగర్‌లోని న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ బుధవారం మాట్లాడుతూ తమ విద్యార్థులు 45 మంది ఈ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూ, ఏట నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

క్యాంపస్ నియామకాలు

మధిర: మధిరలోని శీలం పుల్లారెడ్డి మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాలలో హెటిరో డ్రగ్స్ హైదరాబాద్ వారు క్యాంపస్ నియామకాలను బుధవారం నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 176 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో మొదటి విడతగా 46 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ శీలం వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ కర్నాటి మాధవరెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం



బాధితుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న యువభారత్‌శక్తి ఫౌండేషన్ సభ్యులు

సత్తుపల్లి: పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ ఖాజాపాషా కుమారుడు షేక్ అహ్మద్‌బాష ఫిట్స్‌తో బాధపడుతూ హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. వైద్య సహాయ కోసం యువ భారత్‌శక్తి ఫౌండేషన్ సహాయం కోరగా అందరి సహాయ సహకారాలతో సోషల్ మీడియా ద్వారా రూ.55వేలు వసూలు చేసి ఆ మొత్తాన్ని బుధవారం ముఖ్య సభ్యులు స్వయంగా హైద్రాబాద్ ఆస్పత్రికి వెళ్లి అహ్మద్‌షాషా తల్లిదండ్రులకు అందించారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించనున్న రాతి ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన గురుస్వామి శీలం వెంకటేశ్వరరెడ్డి, పద్మ దంపతుల కుమారుడు రామక్రిష్ణారెడ్డి రూ.25 వేలు విరాళం అందజేశారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ అన్నెం కోటారెడ్డికి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారికి కృతజ్ఞతలు తెలిపింది.

వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఏన్కూరు: ప్రభుత్వమే యాసంగి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఖమ్మం జిల్లా నాయకులు ఎస్‌కే లాల్‌మియా కోరారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ ఎస్‌కే ఖాసీమ్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యాసింగి వరికోతలు మొదలై 15 రోజులు అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి బస్తాకి రూ.200 నుంచి రూ.300 వరకు నష్టపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రజాపంథా నాయకులు కొండే వెంకటేశ్వర్లు, గద్దం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

సత్తుపల్లి: బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా కారేపల్లిలోని చీమలపాడు అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు రూ.కోటి పరిహారంతో పాటు ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. నివాస గృహాల మధ్యలో భారీ జన సమీకరణతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సరికాదన్నారు. ఇకపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

కలగానే కళాతోరణం

నిర్మాణానికి నోచుకోని కాకతీయ స్థూపం

- శంకుస్థాపన చేసి తొమ్మిదేళ్లు
- వెక్కిరిస్తున్న శిలాఫలకం
- రాష్ట్ర సరిహద్దులో ఆత్మగౌరవానికి భంగపాటు



తెలంగాణ - ఏపీ సరిహద్దు (ఇన్‌సెట్) మట్టిలో కలిసి పోతున్న 'కాకతీయ స్థూపం' శిలాఫలకం

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి సమీపంలో మధిర విజయవాడ ప్రధాన రహదారిపై తెలంగాణ – ఏపీ రాష్ట్ర సరిహద్దులో తెలంగాణా రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠల, ఆత్మగౌరవాన్ని చాటేరీతిలో కాకతీయ స్థూపాన్ని (కాకతీయ కళాతోరణం) నిర్మించడం కోసం 2014 సంవత్సరం, మే నెల 2న అప్పటి మంత్రి ఈటెల రాజేందర్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపనకు శిలాఫలకం వేసి 9 ఏళ్లు పూర్తికావస్తుంది. నేటికీ ఆ శిలాఫలకం అలానే కనిపిస్తూ తెలంగాణ పాలకుల పనితీరును వెక్కిరిస్తూ ఉంది. వచ్చే పోయే ఆంధ్రా వాళ్లు ఏంటి దీన్ని ఇలానే వదిలేశారు అనుకుంటూ వెళ్లడం చూస్తున్న తీరు తెలంగాణ ఆత్మగౌరవానికి భంగపాటుగా ఉంది. తెలంగాణగూర్చి సభల్లో పదే పదే మాట్లాడే పాలకులు, అన్ని పార్టీల నాయకులు కాకతీయ స్థూపం(కళాతోరణం) నిర్మాణం దిశగా తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం శూన్యం. ఉమ్మడి రాష్ట్రాల సరిహద్దులో కాకతీయ కళాతోరణం ఏర్పాటు చేస్తే తెలంగాణ కీర్తి నలుదిశలా వ్యాప్తి చెందుతుందని బావించిన అప్పటి టీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొమ్మెర రామ్మూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు విజ్ఞప్తి చేశారు. దీంతో అప్పట్లో మండల పర్యటనకు వచ్చిన అప్పటి మంత్రి ఈటెల రాజేందర్‌తో కాకతీయ స్థూపానికి లాంఛనంగా శంకుస్థాపన చేశారు. మొక్కుబడిగా శంకుస్థాపన చేసిన మంత్రి నిధులు విడుదల మాత్రం పట్టించుకోలేదు. ప్రస్తుత నాయకులు, పాలకులు స్థూపం నిర్మాణం చేసే విషయాన్ని పూర్తిగా మరిచిపోయారు. ఎక్కడో హుజూరాబాద్ నియోజవర్గానికి చెందిన ఎమ్మెల్యే కావడంతో స్థూపం నిర్మించే విషయాన్ని అంతగా పట్టించుకోవడం లేదు. అసలే ఇప్పుడు ఈటెల రాజేందర్ బీజేపీ తీర్థం కూడా పుచ్చుకున్నారు. మండల పర్యటనకు ఓసారి మంత్రి హోదాలో వచ్చిన తుమ్మల నాగేశ్వరరావుతో ఈ విషయాన్ని స్థానిక పాత్రికేయులు ప్రస్తావించగా శంకుస్థాపన చేసిన ఈటెల రాజేందరే నిర్మాణం చేస్తారులే అని చెప్పి వెళ్లిపోయారు. కాకతీయ కళాతోరణం నిర్మాణం చేస్తే పక్క రాష్ట్ర ప్రజలకు సైతం తెలంగాణ ప్రభావం, ప్రాధాన్యత గూర్చి తెలుస్తుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, స్థానిక నాయకులు స్పందించి కాకతీయ కళాతోరణం నిర్మాణానికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

శిలాఫలకం మట్టిలో కలిసిపోతోంది..



తెలంగాణ కీర్తిని చాటి చెప్పే కాకతీయ కళాతోరణం నిర్మాణానికి వేసిన శిలాఫలకం శిథిలమై మట్టిలో కలిసిపోతుంది. ఏళ్ల తరబడిగా అలాగే వదిలేయడం చాలా దురదృష్టకరం. ఇప్పటికైనా పాలకులు స్పందించి కాకతీయ స్తూపం నిర్మాణం చేపట్టాలి.

– రామాల శ్రీనివాసరావు, చిరు వ్యాపారస్తుడు, ఎర్రుపాలెం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..



తెలంగాణా ప్రజల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పే కాకతీయ స్తూపం నిర్మాణం పూర్తి చేసే దిశగా మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. కాకతీయ స్తూపం నిర్మాణానికి పాలకులు నిధులు మంజూరు చేయాలి.

– బాబురావు, తెలంగాణ జాగృతి నియోజకవర్గ కన్వీనర్, రామన్నపాలెం

15వ బెటాలియన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలను ప్రారంభిస్తున్న కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో బుధవారం ఖమ్మం శరత్ మ్యాక్స్‌కేర్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా ప్రారంభించారు. బెటాలియన్ సిబ్బంది, అధికారులు వారి కుటుంబ సభ్యులు, బేతుపల్లి, గంగారం గ్రామ ప్రజలు ఈ నేత్ర వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషా మాట్లాడుతూ.. మనిషి అవయవాలలో అన్నింటికన్న అతి ముఖ్యమైన అవయవం మన కళ్లు అని అటువంటి కళ్లు లేకపోతే సృష్టిని చూడలేమని.. కాబట్టి కంటి సమస్యలు ఉన్న వారందరు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు దళాధిపతి ఎ.అంజయ్య, సహాయ దళాధిపతులు ఎం.ఉదయ్‌భాస్కర్‌రావు, ఆర్.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, వైద్యులు కె.విజయ, ఎల్.నితిన్, బి.విక్రమ్, కోఆర్డినేటర్ బి.అనీల్, బెటాలియన్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



మధిర: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లత

మధిర/ముదిగొండ: మధిర మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో, ముదిగొండలోని పెద్ద మండవలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, సర్పంచ్ రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ల అద్దాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమాదేవి, వార్డు కౌన్సిలర్ కట్టా గాంధీ, డాక్టర్లు పృథ్వీ, దర్మేందర్, చంద్రప్రకాశ్, ఎంపీటీసీ వెంగళరావు, ఉపసర్పంచ్ నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి మల్లారపు వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు తగవు

వైరా: వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌ను పొంగులేటి వర్గీయులు విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, ఏఎంసీ చైర్మన్ బీడీకే రత్నం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి అన్నారు. బుధవారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్‌పై పొంగులేటి వర్గీయులు విమర్శలు చేయడం తగవన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కోటయ్య, విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు, రామారావు, పవిత్ర కుమారి, నాయకులు తదితరులు ఉన్నారు.

తప్పుడు ఆరోపణలు చేయొద్దు

ఏన్కూరు: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయొద్దని మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని 8 సంవత్సరాలుగా వాడుకొని అతడిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రోశయ్య, ప్రహ్లాదరావు, నాగేశ్వరరావు, శివకుమార్ పాల్గొన్నారు.

సీఓఈ సెట్‌లో విద్యార్థి ప్రతిభ

మధిర: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విడుదల చేసిన సీఓఈ సెట్‌లో మధిర పట్టణానికి చెందిన సాగి శశాంక్ ఉత్తమ ప్రతిభను కనబరిచాడు. ఐఐటీకి సంబంధించి హైదరాబాద్‌లోని గౌలిదొడ్డి గురుకుల కళాశాలలో సీటు సాధించాడు. దీంతో శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ ఆకెళ్ల భారతి, ఉపాధ్యాయులు శశాంక్‌ను అభినందించారు.


సభను విజయవంతం చేయాలి

మధిర: అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని భారత జాగృతి మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొబ్బిళ్లపాటి బాబురావు తెలిపారు. బుధవారం మధిరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ జయంతి 14న హైద్రాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు.భారత జాగృతి మధిర మండల అధ్యక్షుడు వినోద్, దినాకర్, మోషే పాల్గొన్నారు.

'గడప గడపకు అంబేద్కర్'..

కల్లూరు: 'గడప గడపకు అంబేద్కర్'కార్యక్రమాన్ని అంబేద్కర్ నగర్‌లో బుధవారం అంబేద్కర్ ఫౌండేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బాబూరావు, ప్రభాకర్, ప్రసాద్, రాంబాబు, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

జీపీఎస్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కొణిజర్లలో కేక్ కట్ చేస్తున్న ఎంపీడీఓ రమాదేవి

కొణిజర్ల: పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగ భద్రత కల్పించాలని జేపీఎస్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నాలుగేళ్లు చేసుకున్న సందర్భంగా బుధవారం కొణిజర్ల, తల్లాడ మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓ ఆర్ రమాదేవి, ఎంపీఓ పి.ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జేపీఎస్ మండల కమిటీ బాధ్యులు మాట్లాడుతూ.. మమ్మలను రెగ్యులరైజ్ చేసి వేతనాలు స్థిరీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు గుగులోత్ రవి, ఉపాధ్యక్షుడు రవీందర్‌లాల్, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, రైతు బంధు మండల కన్వీనర్ డి.వెంకట్‌లాల్, సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెపీపి వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ వైద్యసేవలను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిజియోథెరపీ సేవలతో పిల్లల్లో శారీరక, మానసిక పరిపక్వత కనబడుతుందని తెలిపారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, సీఆర్పీ తిరపయ్య, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

తల్లాడ: మతోన్మాద బీజేపీకీ వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. తల్లాడలోని దొడ్డా కృష్ణయ్య భవనంలో బుధవారం జరిగిన సత్తుపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. బిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడటం కోసం సీపీఎం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. అనంతరం మండలంలోని కేశ్వాపురం గ్రామంలో మృతి చెందిన సీపీఎం నాయకుడు మన్నెపల్లి అప్పారావు బౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, తాతా భాస్కర్‌రావు, చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాసరావు, ఐనాల రామలింగేశ్వరరావు, గాయం తిరుపతరావు, ఎస్.మోహన్‌రావు, ఎస్.కె.మస్తాన్ పాల్గన్నారు.

రేషన్‌షాపుల ద్వారా 12 సరుకులు ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్: రేషన్ షాపుల ద్వారా బియ్యమే కాకుండా 12రకాల సరుకులు ఇవ్వాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు గంటా శ్రీనివాస్, పీఓడబ్ల్యూ డివిజన్ అధ్యక్షురాలు ఎ.కోటమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆందోళనలు నిర్వహించనుండగా, మండలంలోని సత్యంపేటలో బుధవారం పోస్టర్లు ఆవిష్కరించాక వారు మాట్లాడారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేయడమే కాక షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. నాయకులు దేవి, వెంకట నర్సమ్మ, కృష్ణవేణి, దుర్గ, సీత, అలివేలు, వెంకటమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

శివాలయం కమిటీ చైర్మన్‌గా నారాయణరావు

తల్లాడ: మండలంలోని పినపాకలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం కమిటీ చైర్మన్‌గా పులి నారాయణరావును ఎన్నుకున్నారు. దేవాలయానికి స్థలం ఇచ్చి దాతల సహకారంతో నిర్మిస్తున్న నారాయణరావును కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్లుగా గుర్రం నాగేశ్వరరావు, శీలం నాగిరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చావా నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా విలాసాగరం వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఈలప్రోలు అనంతరాములు, కోశాధికారిగా గుడిపూడి నరసింహారావుతో పాటుగా మరో పది మంది సభ్యులను ఎన్నుకున్నారు. త్వరలోనే ఆలయాన్ని ప్రారంభించనున్నట్లు కమిటీ పేర్కొంది.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే



మాట్లాడుతున్న గల్లా సత్యనారాయణ

వేంసూరు: రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మర్లపాడులో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూత్‌లలో పటిష్ఠమైన పోలింగ్ బూత్ కమిటీ నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పథకాలు ప్రతి పౌరుడికి చేరువ చేయడంలో బూత్ కమిటీలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బూత సవక్తి కరణ్ అభియాన్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్, నియోజకవర్గ కన్వీనర్ బాస్కర్ల వీరరాజు, ఉడతనేని అప్పారావు, రుద్రప్రదీప్, పర్సా రాంబాబు, భీమిరెడ్డి బాలకృష్ణ రెడ్డి, దొడ్డపునేని కృష్ణయ్య, పాల నాగసురేంద్రరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పలువురి రాజీనామా



రాజీనామా పత్రాలను చూపిస్తున్న సర్పంచ్‌లు, పార్టీ నాయకులు

బోనకల్: మండలంలో అధికార బీఆర్ఎస్‌కు బుధవారం భారీ షాక్ తగిలింది. మండలంలోని 22 గ్రామాలకు చెందిన 250 కుటుంబాలతో సహా ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ఉపసర్పంచ్‌లు, ఇద్దరు సొసైటీ డైరెక్టర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మందడపు తిరుమలరావు, భూక్యా సైదానాయక్, చిలకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. పొగులేటీ శ్రీనివాసరెడ్డి వెంటే మా పయనం అన్నారు. మండల కమిటీ, జిల్లా కమిటీ, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు తమ పదవులకు రాజీనామాలు చేయడంతో పాటు పార్టీకి కూడా రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామ చేసిన వారిలో ఉమ్మినేని కృష్ణ, తోటకూర వెంకటేశ్వరావు, ఉపసర్పంచ్‌లు రాఘవ, గంగమ్మ, సహకార సంఘ డైరెక్టర్లు దాసు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, ప్రదీప్, వెంకటేశ్వర్లు, మురళి, నాగేశ్వరరావు, కృష్ణ, వాసు, రాంబాబు, మురళి, సురేష్, కొరివి, రాములు తదితరులు ఉన్నారు.

ప్రజా పోరుయాత్రను జయప్రదం చేయండి



సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్/ఏన్కూరు: ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారం దిశగా పోరాట కార్యాచరణ రూపొందించేందుకు సీపీఐ ఆధ్వర్యాన చేపడుతున్న ప్రజా పోరుయాత్రను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం సత్తుపల్లిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఏన్కూరులోని విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలును వివరిస్తూ చేపడుతున్న ఈ యాత్ర 14, 15న సత్తుపల్లి, ఏన్కూరులో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తడికమళ్ల యోబు, నిమ్మటూరి రామకృష్ణ, పాలకుర్తి వీరయ్య, ఖమ్మంపాటి సత్యనారాయణ, కోనేటి వెంకటేశ్వరరావు, చిటెటమ్మ, రమాదేవి, రాములమ్మ, ధనమ్మ, లచ్చమ్మ, వెంకమ్మ, అమరయ్య, వీరభద్రం, భూశయ్య, వెంకన్న, రాంబాబు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క సభకు తరలి రావాలి

వైరా/కల్లూరు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు సంఘీభావంగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఈ నెల 14న మంచిర్యాల పట్టణంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలి రావాలని పీసీసీ సభ్యుడు మాళోత్ రాందాస్ నాయక్, కల్లూరు మండల కిసాన్ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు శీలం బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వైరాలోని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు అధ్యక్షతన, కల్లూరులో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా మల్లు భట్టి విక్రమార్క సత్యాగ్రహ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు కార్యకర్తలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, పాలేటి నరసింహారావు, కుటుంబరావు, పాదిల హరినాద్, చెరుకూరి కిరణ్, కొండలు, శ్రీను, రాము, కృష్ణారావు, రామారావు, కోటేశ్వరరావు, హనుమంతరావు, నాగరాజు, గోపి, అఫ్జల్, ఆయూబ్‌ఖాన్, గోను వెంకటకృష్ణ, బట్టు బాలకృష్ణ, యనమల నర్సిరెడ్డి, కోట సత్యం, వేల్పుల కృష్ణ, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఈ సారి కాంగ్రెస్‌దే అధికారం..



కరపత్రాలను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ సభ్యుడు శీలం ప్రతాప్ రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా బుధవారం రాత్రి మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కర పత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బండారు నరసింహారావు, షేక్ జానీ భాషా, కోటపాటి పాండు రంగారావు, బాబురావు, జనార్దన్, బోస్ బాబు, వెంకటరత్నం, అనీల్ కుమార్, రోశయ్య, వెంకట నర్సయ్య, పూర్ణ, ఏడుకొండలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని ముత్యాలమ్మతల్లి, బొడ్రాయి, జంటనాగులు, సుబ్రమణ్యస్వామి ప్రతిష్ఠాపన మొదటి వార్షికోత్సవం సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ మట్టా రాగమయిలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, కౌన్సిలర్ చాంద్‌పాషా, ఆనందరావు, ప్రకాశరావు, కృష్ణయ్య, వెంకటేశ్వరరావు, పాపారావు, సుబ్బారెడ్డి, రామకృష్ణ, సాయి, మణికుమార్, రాజేష్, శివ, శ్రీను, సాంబయ్య, సత్యావతి, నవ్య పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

ఈ మోడును మరిచిపోయారా?



మండలంలోని తనికెళ్లలో కొంతకాలం క్రితం భారీ వర్షం, ఈదురు గాలులకు రోడ్డు పక్కనే ఉన్న పెద్ద మర్రి చెట్టు నేలకూలింది. అప్పట్లో పోలీసులు, పంచాయతీ పాలకమండలి బాధ్యులు చెట్టు భాగాలను కొంతమేర తొలగించినా... మోడును వదిలేశారు. రోడ్డును ఆనుకుని ఉన్న చెట్టు తాజా వర్షాలతో ఆ మోడు చిగురించడం మొదలుపెట్టిన నేపథ్యాన రాత్రివేళ ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న మర్రి చెట్టు మొదలును తొలగించాలని కోరుతున్నారు. - కొణిజర్ల

ప్రశ్నించాల్సిన అధికారి :
జి ప్రవీణ్‌కుమార్,
ఏఈ, ఆర్‌అండ్‌బీ
సెల్ నంబర్ : 76608 05013